
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 21 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.32 వేలు పలికాయి. మార్కెట్‌కు 345 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో @ రూ.15

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్ఠంగా రూ.15, కనిష్ఠం రూ.4, సరాసరిన రూ.7.50 చొప్పున పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
36.4°/17.1°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం స్వల్పంగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షకు 987 మంది గైర్హాజర్

ప్రశాంతి నిలయం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 987 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 99 కేంద్రాల్లో జరిగిన పరీక్షకలకు 32,514 మంది విద్యార్థులకు గాను 31,527 మంది మాత్రమే హాజరుకాగా, 987 మంది గైర్హాజయ్యారు. ఇందులో జనరల్‌కు సంబంధించి 29,891 మందికి గాను 29,039 మంది హాజరయ్యారు. 852 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్‌కు సంబంధించి 2,623 మందికిగాను 2,488 మంది మాత్రమే హాజరయ్యారు. 135 మంది గైర్హాజరయ్యారు.

నేటి నుంచి ఇంటర్ 'స్పాట్'

ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని ఆర్ఐఓ సురేష్ బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పాట్ వాల్యుయేషన్ ఆర్డర్స్ పొందిన వారు అనంతపురం న్యూటౌన్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

నేడు ఎస్కేయూ పాలకమండలి సమావేశం



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పాలకమండలి సమావేశం మంగళవారం నిర్వహించనున్నారు. పాలక భవనంలో జరిగే సమావేశానికి అందుబాటులో ఉన్న పాలకమండలి సభ్యులు నేరుగా పాల్గొంటారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారు వర్చువల్‌గా అంశాలు చర్చించనున్నారు. జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్, బోధనేతర ఉద్యోగులు పెద్దన్న, ముత్యాలప్ప, చంద్రబాబు లపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని వర్సిటీ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు పాలకమండలి అనుమతి తీసుకోనున్నారు. రూసా (రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్షా అభియాన్) కోఆర్డినేటర్, సైన్స్ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ జీవన్‌కుమార్ నెలాఖరులో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈయన స్థానంలో కొత్త రూసా కోఆర్డినేటర్‌ను నియామకం చేయనున్నారు. ఇది వరకు ఉన్న ఆర్ట్స్, క్యాంపస్ సైన్స్ కళాశాలలను విలీనం చేసి ఒకే కళాశాలగా ఏర్పాటు చేయనున్నారు. ఒకే ప్రిన్సిపాల్‌ను నియామకం చేయనున్నారు. ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాలను విలీనం చేసి ఫిజిక్స్ విభాగంగా మార్పు చేయనున్నారు. ఇలా మొత్తం 50 అంశాలతో ఎజెండా రూపొందించారు.

పంటల నష్టంపై నివేదిక సిద్ధం



మాట్లాడుతున్న అవుటాల రమణారెడ్డి, డీహెచ్ఓ చంద్రశేఖర్

పుట్టపర్తి అర్బన్: అకాల వర్షాలకు నష్టపోయిన రబీ, ఉద్యాన పంటల నివేదికను సిద్ధం చేశామని, త్వరలోనే ప్రభుత్వానికి పంపి రైతులకు పరిహారం అందేలా చూస్తామని జిల్లా అగ్రి బోర్డ్ అడ్వయిజరీ చైర్మన్ అవుటాల రమణారెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం వారు స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని 14 మండలాల్లో రబీలో సాగు చేసిన 349 హెక్టార్ల మొక్కజొన్న, 41 హెక్టార్ల వేరుశనగ, 25 హెక్టార్ల పొద్దు తిరుగుడు, ఒక హెక్టారు రాగి కలిపి మొత్తం 416 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఇక ఉద్యాన పంటల్లో మామిడి 50 హెక్టార్లు, టమాట 25 హెక్టార్లు, అరటి 31 హెక్టార్లు, దోస పంట 20 హెక్టార్లు, ఖర్బూజా 11 హెక్టార్లతో కలిపి తమలపాకు, పొట్లకాయ, బొప్పాయి, బెండ, ఉల్లి తదితర పంటలు సుమారు 156.30 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఆర్బీకే, ఉద్యాన శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టం అంచనాలు వేసి నివేదిక సిద్ధం చేశారన్నారు. ఈ నివేదికను ప్రభుత్వానికి పంపతున్నామన్నారు.

అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: అగ్నివీర్ కార్యాచరణలో భాగంగా భారత వాయుసేనలో ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్/డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 31వ తేదీ లోపు https://agnipathvayu. cdac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు అందజేయాలి.

సగర్వంగా నిల'బడి'

నాడు



ఇది చెన్నేకొత్తపల్లి మండలం హరియాన్ చెరువు ప్రాథమికోన్నత పాఠశాల. గతంలో వర్షం వస్తే చాలు నీరంతా పాఠశాల ప్రాంగణంలో నిలిచేది. తరగతి గదులు అధ్వానంగా ఉండేవి. తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఉండేది కాదు. వైఎస్ జగన్ ప్రభుత్వం 'మన బడి నాడు- నేడు' కింద ఈ పాఠశాల స్వరూపాన్నే మార్చేసింది. రూ.లక్షలు ఖర్చు చేసి తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్‌తో పాటు సౌకర్యాలన్నీ కల్పించి కార్పొరేట్ స్కూళ్ల సరసన సగర్వంగా నిలబెట్టారు.

నేడు



సకల హంగులతో కార్పొరేట్ స్కూల్‌ను తలపిస్తున్న హరియాన్ చెరువు ప్రాథమికోన్నత పాఠశాల

- నాడు -నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు
- మెరుగైన వసతులతో పెరిగిన అడ్మిషన్లు
- కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు
- జిల్లాలో చురుగ్గా రెండో విడత పనులు
- నెలాఖరుకు పనుల పూర్తికి చర్యలు

ప్రశాంతి నిలయం: 'పిల్లలకు మనమిచ్చే విలువైన ఆస్తి విద్య ఒక్కటే' అని చెప్పే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వాటి స్వరూపాన్నే మార్చేందుకు 'మన బడి నాడు- నేడు' పథకానికి శ్రీకారం చుట్టారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులను మారుస్తున్నారు.

అభివృద్ధి పనులు ఇలా..

'మన బడి నాడు-నేడు' కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసింది. ఎనిమిది రకాల పనులు చేపట్టింది. రక్షిత తాగునీటి కోసం నీటి శుద్ధి యంత్రాలు ఏర్పాటు, బాలురు, బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, కరెంటు సౌకర్యం, ఇంగ్లిష్ ల్యాబ్‌ల ఏర్పాటు, తరగతి గదుల్లో ఫర్నిచర్, గ్రీన్ బోర్డుల ఏర్పాటు, భవనాలకు పెయింటింగ్, పాఠశాల ప్రాంగణంలో గ్రానైట్ ఏర్పాటు తదితర పనులు చేపట్టారు. రెండో విడత 'మన బడి నాడు-నేడు'లో మొదటి విడత చేపట్టిన పనులకు అదనంగా రెండు పనులను కలిపారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, ఉపాధి హామీ ద్వారా పాఠశాలలకు ప్రహరీలు నిర్మిస్తున్నారు.

రెండు విడతల్లో 1,678 స్కూళ్లలో సౌకర్యాల కల్పన..

జిల్లాలోని వివిధ యాజమాన్యాల కింద పనిచేస్తున్న 2,511 ప్రభుత్వ పాఠశాలల్లో 2,49,910 మంది విద్యార్థులు చదువుతున్నారు. 7,750 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. 'మన బడి నాడు-నేడు' తొలి విడత కోసం అధికారులు జిల్లాలోని 596 పాఠశాలలను ఎంపిక చేశారు. రూ.167 కోట్లు ఖర్చు చేసి మౌలిక వసతుల కల్పనతోపాటు పలు అభివృద్ధి పనులు చేపట్టారు. రెండో విడతలో మరో 1,082 పాఠశాలల్లో రూ.314 కోట్లతో దాదాపు 3,416 అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో 714 మరుగుదొడ్లు, 307 అదనపు గదులు, 478 వంట గదులు, 759 మేజర్, మైనర్ మరమ్మతులు, 758 పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం, 373 పాఠశాలలకు ప్రహరీల నిర్మిస్తున్నారు. అలాగే చెట్లకింద చదువులకు స్వస్తి చెబుతూ 1,000 అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు. ఈ పనులన్నీ నిర్దేశించిన గడువులోపు పూర్తి చేసేందుకు అధికారులు ముమ్మరంగా కృషి చేస్తున్నారు.

ఏజెన్సీల ద్వారా పనుల నిర్వహణ..

పాఠశాలల్లో చేపట్టిన 'నాడు-నేడు' పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత లోపించకుండా ఉండేందుకు ప్రభుత్వం రెండో విడత పనులను పలు ఏజెన్సీలకు అప్పగించింది. రెండో విడతలో ఎంపిక చేసిన 1,082 పాఠశాలల్లో ఏపీఈడబ్ల్యూఐడీసీకి 231 పాఠశాలలు, సమగ్రశిక్షకు 236 పాఠశాలలు, పంచాయతీ రాజ్‌కు 266 పాఠశాలలు, పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ శాఖకు 92 పాఠశాలలు, ఆర్‌డబ్ల్యూఎస్‌కు 143 పాఠశాలలు, ఇరిగేషన్‌కు 114 పనులు అప్పగించారు. దీంతో ప్రస్తుతం జిల్లాలో నాడు- నేడు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చాలా స్కూళ్లలో ఇప్పటికే పూర్తయ్యాయి. తొలి విడతలో ఏపీఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో 75 పాఠశాలలు, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 155 పాఠశాలలు, పంచాయతీ రాజ్ విభాగం పర్యవేక్షణలో 215 పాఠశాలలు, పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో 45 పాఠశాలలు, ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షణలో 97 పాఠశాలల్లో పనులను పూర్తి చేశారు.

పారదర్శకత కోసం ఫొటో క్యాప్చరింగ్..

'నాడు-నేడు' పనులను పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. నిధుల విడుదల నుంచి పనుల పురోగతి, నిధుల వినియోగం, పనుల్లో నాణ్యత వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఫొటో క్యాప్చరింగ్ విధానాన్ని అమలు చేస్తోంది. ఆయా పాఠశాలల్లో పనులు చేపట్టిన ఏజెన్సీ ద్వారా పనులను పర్యవేక్షిస్తున్న క్షేత్రస్థాయి ఇంజినీరింగ్ సిబ్బంది ప్రతి వారం తప్పనిసరిగా పనుల పురోగతిని తెలియజేసేలా ఫొటోలు తీసి 'మనబడి నాడు-నేడు' యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. రాష్ట్ర స్థాయి అధికారులు పరిశీలించి లోటుపాట్లపై క్షేత్ర స్థాయి సిబ్బందికి తగిన సూచనలు చేస్తూ పనులను పర్యవేక్షిస్తారు. జిల్లాలో రెండో విడత నాడు- నేడు కింద 1,082 పాఠశాల్లో చేపట్టిన 3,416 పనులకు సంబంధించి ఇప్పటి వరకు 3,406 పనులను ఫొటో క్యాప్చరింగ్‌ను పూర్తి చేశారు. దీంతో ఫొటో కాప్చరింగ్‌లో రాష్ట్రంలోనే జిల్లాకు ద్వితీయ స్థానం దక్కింది. పనులు కూడా ఇప్పటికే 70 శాతం పూర్తికాగా, మిగిలిన పనులన్నీ గడువులోపు పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

596
నాడు- నేడు తొలి దశలో ఎంపికైన పాఠశాలల సంఖ్య

రూ.167 కోట్లు
తొలి విడతలో మంజూరైన మొత్తం

1,082
రెండో విడతకు ఎంపికైన పాఠశాలలు

రూ.314 కోట్లు
రెండో విడతలో మంజూరైన మొత్తం

గడువులోపు పనులు పూర్తి



'మన బడి నాడు-నేడు' పనులు సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. ఎక్కడా అవకతవకలకు అస్కారం లేకుండా చూస్తున్నాం. ప్రభుత్వం కూడా ఎప్పుడూ లేని విధంగా జిల్లాకు నిధులను మంజూరు చేసింది. పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేస్తున్నాం. -మీనాక్షి, ఇన్‌చార్జ్ డీఈఓ

సమూల మార్పులు



విద్యారంగంలో సమూల మార్పులకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ విడుదల చేయనన్ని నిధులు పాఠశాలల కోసం మంజూరు చేస్తున్నారు. 'నాడు- నేడు' పనులతో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. అందువల్లే ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లు గణనీయంగా పెరుగుతున్నాయి.
- పీవీ రమణా రెడ్డి, ఉపాధ్యాయుడు, ఎనుములపల్లి పాఠశాల

వార్డు మెంబర్‌గా గెలవలేని దద్దమ్మ లోకేష్

- ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి ఆయనకు లేదు
- దమ్ముంటే ఎంపీ మిథున్‌రెడ్డి సవాల్‌ను స్వీకరించు
- లోకేష్‌పై కదిరి ఎమ్మెల్యే డా.సిద్దారెడ్డి ఆగ్రహం



కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి: 'కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని దద్దమ్మ నువ్వు. మంగళగిరి ప్రజలు నిన్ను చిత్తుగా ఓడించారు. నువ్వు కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తే ఎలా?..నీకు దమ్ము, ధైర్యం ఉంటే..నీలో చిత్తూరు జిల్లా డీఎన్ఏ ఉంటే ఎంపీ మిథున్‌రెడ్డి సవాల్‌ను స్వీకరించు. ఆ జిల్లాలో నువ్వు మిథున్‌రెడ్డి మీద పోటీ చేసి గెలువు..'అని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి టీడీపీ నేత లోకేష్‌కు సవాల్ విసిరారు. సోమవారం ఎమ్మెల్యే అమరావతి నుంచి ఒక వీడియో విడుదల చేశారు. 'యువగళం'పాదయాత్రలో భాగంగా కదిరి నియోజకవర్గంలో పర్యటిస్తున్న లోకేష్‌తో పాటు టీడీపీ కదిరి నియోజక వర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్‌లు చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఘాటుగా స్పందించారు. 'మీ నాన్న చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదు. బీసీలు న్యాయమూర్తులుగా పనికి రారని చెప్పింది చంద్రబాబు కాదా? బీసీల తోకలు కత్తిరిస్తానని చెప్పలేదా? ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా? అని బాబు మాట్లాడలేదా...?, ఎస్టీలకు గానీ, ముస్లిం, మైనార్టీలకు గానీ తన మంత్రి వర్గంలో చోటు ఇవ్వని మాట వాస్తవం కాదా?.. చంద్రబాబుకు గానీ, పప్పుగా పిలవబడుతున్న నీకు గానీ ఆయా వర్గాల ఓట్లను అడిగే హక్కులేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అన్నింటిలోనూ సముచిత స్థానం కల్పిస్తున్న ఘనత సీఎం వై ఎస్ జగన్‌కే దక్కుతుంది'అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నీ పక్కనున్నది డీడీల దొంగ..

'రెండు బ్యాంకుల్లో డీడీలను దొంగిలించి 12 ఏళ్ల శిక్ష పడిన ఖైదీ కందికుంట. అలాంటి దొంగను పక్కన పెట్టుకొని నువ్వు నీతులు మాట్లాడితే కదిరి ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. కదిరిలో వరుసగా రెండు సార్లు వైఎస్సార్ సీపీ జెండా ఎగిరింది. మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టబోతున్నాం. అనాథ క్రిస్టియన్ పిల్లల బోర్డింగ్ స్కూల్‌ను కూలగొట్టి కబ్జా చేసిన దుర్మార్గుడు కందికుంట. ముస్లింల స్థలాలను ఆక్రమించి చుట్టూ కంచె వేసిన నీచుడు. ఎస్టీల ఆస్తులను దోచుకున్న దౌర్భాగ్యుడు. అలాంటి కబ్జాకోరును పక్కన బెట్టుకొని సీఎం పైనా, ప్రభుత్వం పైనా, నా పైనా నిరాధారమైన ఆరోపణలు చేస్తే కదిరి ప్రజలు నిన్ను గానీ, ఆ డీడీల దొంగను గానీ, నీ పార్టీని గానీ నమ్మే పరిస్థితుల్లో లేరు. కదిరి ప్రజలు చాలా తెలివైన వారు'అని ఎమ్మెల్యే అన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ అడ్రెస్ మాది..

'కబ్జాలకు కేరాఫ్ అడ్రస్ మీదైతే..అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ మాది. కదిరికి రింగ్‌రోడ్డు ఏర్పాటు చేస్తామని 2014లో చంద్రబాబు హామీ ఇచ్చి మోసగించారు. గిరిజనులకు కమ్యూనిటీ భవనం నిర్మిస్తామని మాట తప్పారు. హంద్రీనీవా టన్నెల్ పనులను కూడా అర్థాంతరంగా ఆపేశారు. కానీ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనతి కాలంలోనే ఎంతో అభివృద్ధి చేశాం. సుమారు రూ.250 కోట్లతో బైపాస్ రోడ్డు పనులు చేపట్టాం. ఆ పనులు కూడా త్వరలోనే పూర్తవుతాయి. ఇంకా 150 గ్రామాలకు పైగా సీసీ, బీటీ రోడ్లు వేశాం. ప్రతి చెరువునూ కృష్ణా జలాలతో నింపాం. కదిరిలో అధునాతన వసతులతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తున్నాం. మరో నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి వార్డులో కాలువలు, రోడ్లు నిర్మించాం. ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి' అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఎడమొహం.. పెడమొహం

ఉనికి కోల్పోతున్న టీడీపీకి జవసత్వాలు తెచ్చేందుకు ఆ పార్టీ నేత లోకేష్ 'యువగళం' పేరుతో చేపట్టిన పాదయాత్ర అసలుకే మోసం తెస్తోంది. కదిరిలో ఉప్పునిప్పులా ఉన్న అత్తార్, కందికుంట మధ్య విభేదాలు 'యువగళం'లో మరోసారి బయటపడ్డాయి. పాదయాత్రలో లోకేష్‌కు కుడి, ఎడమగా మెలుగుతున్న అత్తార్, కందికుంట బలనిరూపణకు సిద్ధమయ్యారు. పోటాపోటీ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుండగా...ఎటువెళ్తే ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో తెలియని తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారు.

- 'యువగళం'లో అత్తార్, కందికుంట ఎవరికివారే
- లోకేష్ వద్ద మార్కుల కోసం పోటాపోటీ
- బీసీ, మైనార్టీ సభలతో బలనిరూపణకు పాట్లు



సాక్షి, పుట్టపర్తి: 'యువగళం' దెబ్బతో కదిరి నేతల తీరు మరోసారి బట్టబయలైంది. కదిరి టీడీపీ టికెట్ రేసులో ఉన్న అత్తార్, కందికుంట 'చినబాబు'తో చేయికలిపి నడుస్తున్నా.. ఇద్దరి మధ్య విభేదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. లోకేష్ యువగళం పాదయాత్రలో అత్తార్ చాంద్‌బాషా, కందికుంట వెంకట ప్రసాద్ ఏకంగా బలనిరూపణకు సిద్ధమయ్యారు.

నోరు విప్పని లోకేశ్..

'యువగళం' పాదయాత్ర కదిరి నియోజకవర్గంలో నాలుగు రోజుల పాటు సాగింది. ఆరంభం నుంచి అత్తార్, కందికుంట ఒకరిపై ఒకరు పైచేయి సాధించాలని చూస్తున్నారు. ఇందులో భాగంగానే సోమవారం కదిరి పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్లో ఉదయం కందికుంట ఆధ్వర్యంలో బీసీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అత్తార్ చాంద్ బాషా మధ్యాహ్నం మైనార్టీలతో మరో సమావేశం ఏర్పాటు చేశారు. ఒకే వేదికపై రెండు కార్యక్రమాలు ఎందుకంటూ అసహనం వ్యక్తం చేసిన లోకేష్... ఏమీ చేయలేని పరిస్థితుల్లో రెండు కార్యక్రమాల్లో పాల్గొనడం విశేషం.

తమ్ముళ్లదీ తలోదారి..

అత్తార్, కందికుంట వర్గాలు కూడా 'యువగళం'లో తమ నిరసన గళం వినిపించాయి. అత్తార్‌కు పేరు రాకుండా ఉండేందుకు కందికుంట వర్గం ప్రయత్నిస్తుండగా...కందికుంటకు మైలేజీ రాకుండా అత్తార్ వర్గం చేయాల్సిందంతా చేసింది. అతుకులబొంత టీడీపీని ఇద్దరు నాయకులు చేరో వైపు లాగుతుంటే... తమ్ముళ్లు ఏం చేయాలో తెలియని సందిగ్ధంలో పడిపోయారు. ఈ క్రమంలోనే సోమవారం జరిగిన బీసీ, మైనార్టీ సభల్లో కనిపించేందుకు చాలా మంది జంకారు. కందికుంట ఆధ్వర్యంలో జరిగిన బీసీ ఆత్మీయ సభలో కనిపిస్తే అత్తార్ అగ్గిమీద గుగ్గిలమవుతాడు. పోనీ అత్తార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మైనార్టీ సభకు వెళ్దామంటే కందికుంటకు కోపమొస్తుంది. అందుకే తమ్ముళ్లంతా తలోదారి చూసుకున్నారు. లోలోన కత్తులు దూస్తూ పైకి మాత్రం కలిసి లోకేష్ వెంట నడుస్తున్న ఈ ఇద్దరు నేతల తీరుపై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్ అవుతున్నాయి.

నేటి నుంచి విద్యార్థులకు రాగిజావ

- తాడేపల్లి నుంచి ప్రారంభించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- జిల్లా విద్యార్థులతో వర్చువల్‌గా మాట్లాడే అవకాశం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బసంత్ కుమార్

ప్రశాంతి నిలయం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు 'జగనన్న గోరుముద్ద' పేరుతో పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్న జగన్ సర్కార్... మెనూలో అదనంగా రాగి జావను చేర్చింది. మంగళవారం తాడేపల్లి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. జిల్లాకు సంబంధించిన కార్యక్రమాన్ని కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ జిల్లా విద్యార్థులతో వర్చువల్‌గా మాట్లాడనున్నారు. ఈ మేరకు కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం సాయంత్రం కలెక్టర్ బసంత్ కుమార్, ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి, ఇతర అధికారులతో కలసి పరిశీలించారు.

జిల్లాలోని 1,46,311 మందికి లబ్ధి..

జగనన్న గోరుముద్ద పథకం ప్రస్తుతం రాష్ట్రంలోని 44,392 పాఠశాలల్లో అమలవుతోంది. ఈ పథకం కింద ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు రుచి, శుచితో కూడిన పౌష్టికాహారాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నారు. తాజాగా గోరుముద్దలో రాగిజావ కూడా చేశారు. ఇక జిల్లాలోని 2,031 ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు 1,46,311 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ జగనన్న గోరుముద్దులో భాగంగా వారంలో మూడు రోజుల (మంగళ, గురు, శని) పాటు రోజు మార్చి రోజు ఉదయం తరగతులు ప్రారంభానికి ముందు రాగిజావ అందించనున్నారు. కాల్షియం, మెగ్నీషియం, అమైనో అమ్లాలు, ఫైబర్, విటమిన్ బి, మినరల్స్‌ను అధికంగా ఉండే రాగి జావ ఇవ్వడం వల్ల విద్యార్థులు ఆరోగ్యం మెరుగుపడడంతోపాటు, జ్ఞాపక శక్తి, ఆలోచనా శక్తులు కూడా మరింత మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ఒక్క అర్జీ పెండింగ్‌లో ఉండకూడదు

- జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ టీఎస్ చేతన్

పుట్టపర్తి అర్బన్: 'స్పందన'లో అందే ఒక్క అర్జీ పెండింగ్‌లో ఉండకూడదని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో జేసీతో పాటు డీఆర్ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 134 అర్జీలను అందాయి. ఈ సందర్భంగా జేసీ చేతన్ మాట్లాడుతూ... 'స్పందన' అర్జీల పరిష్కారంలో అలసత్వం పనికిరాదన్నారు. అర్జీలు సకాలంలో పరిష్కరించాల్సిన బాధ్యత ప్రతి శాఖ అధికారిపై ఉందన్నారు. ఇందులో ఎవరు అలసత్వం వహించినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రతి శాఖ అధికారి ఎప్పటికప్పుడు పెండింగ్ అర్జీలు పరిశీలించి పరిష్కరించాలన్నారు.

25న 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: డ్వాక్రా మహిళలకు అండగా నిలిచేందుకు అమలు చేస్తున్న 'వైఎస్సార్ ఆసరా' పథకం మూడో విడత ఆర్థిక సాయాన్ని ఈనెల 25న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీ వరకూ జిల్లాలో ఆసరా ఉత్సవాలను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి హౌసింగ్, మనబడి నాడు-నేడు, గ్రామ, వార్డు సచివాలయాలు, వైఎస్సార్ ఆసరా, పోషణ పక్వాడా, రాగిజావ పంపిణీ తదితర అంశాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 'జగనన్న గోరుముద్ద' వారంలో మూడు రోజులు రాగిజావ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈఓలు, హెచ్ఎంలు సమన్వయం చేసుకొని 'నాడు-నేడు పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో వివిధ దశల్లో ఉన్న ఇళ్లన్నీ మూడు వారాల్లో పూర్తి చేయాలన్నారు. అలాగే 0-5 ఏళ్ల మధ్య వయసు గల పిల్లల డేటా అప్‌లోడ్ చేయాలన్నారు. 'పోషణ పక్వాడా' కార్యక్రమంలో మిల్లెట్స్ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. పిల్లలు, గర్భిణీలకు అందించే పోషకాహారంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జేసీ టీఎస్ చేతన్, డీఆర్ఓ కొండయ్య, సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. పోషణ్ అభియాన్ పథకంలో భాగంగా పోషకాహారంపై ప్రజలను చైతన్య పరుస్తూ చేపట్టిన ర్యాలీని సోమవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఆకుకూరలు, చిరుధాన్యాల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయని, వీటిని తరచూ ఆహారంగా తీసుకోవడం ఉత్తమమని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డాక్టర్ నాగరాజునాయక్, సీడీపీఓ గాయత్రి, సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధి తోడుగా.. ఉద్యానం నిండుగా

జిల్లాలో ఉద్యాన పంట సాగు పెరుగుతోంది. రైతుల ఆసక్తిని గమనించిన ప్రభుత్వం సబ్సిడీలతో ప్రోత్సాహం అందిస్తుండడంతో ఉత్సాహంగా పంటలు సాగు చేసుకుంటున్నారు. ఉపాధి హామీ తోడవడంతో చాలా మంది ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు.

- ఉపాధిహామీ పథకం కింద మొక్కల పెంపకం
- వందశాతం సబ్సిడీతో పెంపకానికి రైతుకు భరోసా



కొడపగానిపల్లి వద్ద ఉపాధిహామీ కింద మొక్కల పెంపకం

జిల్లా వ్యాప్తంగా 2022-23 ఏడాదికి సంబంధించి మొక్కల పెంపకానికి దరఖాస్తు చేసుకున్న రైతులు, విస్తీర్ణం వివరాలు..		
నియోజకవర్గం	రైతులు	ఎకరాలు
పుట్టపర్తి	415	1146
కదిరి	189	497
ధర్మవరం	477	1457
పెనుకొండ	126	288
హిందూపురం	134	269
రాప్తాడు(3మండలాలు)	250	930
మడకశిర	142	247
మొత్తం	1733	4,837

అమడగూరు: ఉపాధిహామీ పథకం కింద పొలాల్లో మొక్కలు పెంచుకోవడానికి కూడా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. ఏదేని మొక్కల పెంపకమైనా ప్రభుత్వం పూర్తిగా వందశాతం సబ్సిడీని రైతులకు అందజేస్తూ వారికి భరోసా ఇస్తోంది. 5 ఎకరాల లోపున్న రైతులు పొలాల్లో మొక్కల పెంచుకోవడానికి అనుమతినిచ్చి సన్నకారు, మధ్య తరగతి వర్గాల కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తోంది.

వందశాతం సబ్సిడీ..

మొక్కల పెంపకానికి రైతులకు ఎలాంటి ఖర్చులు లేకుండా మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది. పొలాన్ని దుక్కి చేసుకోవడానికి, గుంతలను తవ్వించడానికి, మొక్కల కొనుగోలుకు, రవాణా ఖర్చులు, కలుపుతీత ఖర్చులు సైతం చెల్లిస్తోంది. తర్వాత మూడేళ్ల వరకూ మొక్కల పెంపకానికి అవసరమయ్యే నీటి బిల్లులు, కాపాలాదారు బిల్లులు ఇస్తోంది. కాపాలాదారుకు నెలకు ఎకరానికి రూ.1,150 చొప్పున 5 ఎకరాల వరకూ ఇస్తోంది.

పంట రకాన్ని బట్టి..

రైతులు సాగు చేసే పంట రకాన్ని బట్టి ప్రభుత్వం డబ్బు చెల్లిస్తోంది. ఒక సంవత్సరానికి ఎకరా మామిడితోటకు రూ 1.05 లక్షలు, దానిమ్మ తోటకు రూ 1.06 లక్షలు ఇలా పంట రకాన్ని బట్టి లక్షకు తగ్గకుండా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది.

ప్రతినెలా బిల్లు ఇస్తున్నారు



2 ఎకరాల్లో ఉపాధిహామీ పథకం కింద మామిడి పండ్ల మొక్కలు నాటాను. మొత్తం ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించింది. అలాగే ప్రస్తుతం తోట కాపాలాదారుగా ఉన్న నాకు వాచ్‌అండ్‌వార్డు కింద ప్రతి నెలా రూ 2,520 జమ చేస్తున్నారు. నీటి సరఫరా బిల్లులు కూడా ఉన్నతాధికారులకు పంపాం.

– మంగేనాయక్, మలకవారిపల్లి తండా

దరఖాస్తు చేసుకోవచ్చు



ఉపాధిహామీ కింద పండ్లతోటల పెంపకానికి ముందుకు వచ్చే రైతులందరికీ ప్రభుత్వం వందశాతం సబ్సిడీని ఇస్తూ వారిని ప్రోత్సహిస్తోంది. ఆసక్తి కలిగిన రైతులంతా సంబంధిత మండలాల్లోనే దరఖాస్తు చేసుకోవచ్చు. రైతులు ఇబ్బంది పడకుండా మొక్కలు నాటిన పొలంలోనే అంతరపంటగా ఏదైనా సాగు చేసుకోవచ్చు.

– రామాంజినేయులు, డ్వామా పీడీ

రాష్ట్ర చరిత్రలో ఇదో 'చీకటి రోజు'

- జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ



క్యాంప్ కార్యాలయంలో బ్లాక్ డే ప్లకార్డ్ ప్రదర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: సభా సంప్రదాయాలను ఉల్లంఘించడంతో పాటు ఏకంగా సభాపతిపై దౌర్జన్యానికి దిగడం దురదృష్టకరమని, రాష్ట్ర చరిత్రలో ఇది చీకటి రోజని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం చోటు చేసుకున్న పరిణామాలను ఆమె ఖండించారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ తీసుకున్న చొరవను చంద్రబాబుతో పాటు టీడీపీ ప్రజాప్రతినిధులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయం వెన్నాడుతుండడంతో అసెంబ్లీలో దిగజారుడు రాజకీయాలకు తెరలేపారని మండిపడ్డారు. సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించుకోవాలనే కనీస ఆలోచన కూడా లేని ఎమ్మెల్యేలుండడం టీడీపీ దౌర్భాగ్యమన్నారు. సభాపతి తమ్మినేని సీతారాం వద్దకెళ్లి ఆయన ముఖంపై ప్లకార్డులను ప్రదర్శించడం, దళిత ఎమ్మెల్యే సుధాకర్‌పై దౌర్జన్యానికి దిగడం టీడీపీ ఎమ్మెల్యేల రౌడీయిజానికి పరాకాష్టగా అభివర్ణించారు. దీని వెనుక చంద్రబాబు హస్తముందని ఆరోపించారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సైతం పలు సందర్భాల్లో మహిళలను కించపరిచేలా మాట్లాడిన ఉదంతాలున్నాయన్నారు. జీఓ నంబర్-1 అన్ని రాజకీయ పార్టీలకు వర్తిస్తుందని, దీంతో టీడీపీకి ఎలాంటి నష్టముండదన్నారు. దీనిపై అనవసరంగా రాద్ధాంతం చేయడం తగదన్నారు. ఇరుకైన రోడ్లలో సభలు, యాత్రలు సాగిస్తుండడంతో అమాయక ప్రజలు మృత్యువాతపడుతున్నారని, ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనే విషయాన్ని మరవరాదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు, ఆయన ఎమ్మెల్యేలు రాష్ట్రాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై సభాపక్షంగా సలహా, సూచనలు ఇస్తే బాగుంటుందన్నారు. సభా సంప్రదాయాలను పాటిస్తామని మాటివ్వడంతో పాటు సభకు, సభాపతికి, ఎమ్మెల్యే సుధాకర్‌కు చంద్రబాబు ఆయన ఎమ్మెల్యేలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దశలవారీగా మద్యపాన నిషేధానికి సీఎం వైఎస్ జగన్ కట్టుబడి ఉన్నారన్నారు. అలాగే ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాల్లో 98 శాతం నెరవేర్చిన ఘనత కూడా సీఎం వైఎస్ జగన్‌దేనని గుర్తుంచుకోవాలన్నారు.

నేటి నుంచి ఉగాది వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో శోభకృత నామ సంవత్సర ఉగాది పర్వదిన సందడి మొదలైంది. వేడుకలను పురస్కరించుకుని సత్యసాయి మహాసమాధిని, సాయికుల్వంత్ సభా మందిరాన్ని ఫల, పుష్పదళాలతో తీర్చిదిద్దారు. వేడుకల్లో పాల్గొనేందుకు దేశవిదేశాలకు చెందిన సత్యసాయి భక్తులు ఇప్పటికే పుట్టపర్తికి చేరుకున్నారు. 'సాయి యువ సంకల్ప పర్తియాత్ర' పేరుతో సత్యసాయి సేవా సంస్థలకు చెందిన వందలాది మంది యువత సైతం ప్రశాంతి నిలయం చేరుకుంది. వీరంతా పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సందేశాత్మక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం వేదపఠనంతో వేడుకలు ప్రారంభమవుతాయి. రాష్ట్ర సత్యసాయి యూత్ కోఆర్డినేటర్ సాయి ప్రదీప్ ప్రసంగిస్తారు. స్వరార్చన పేరుతో సంగీత విభావరి నిర్వహిస్తారు. సత్యసాయి యూత్ సావనీర్ విడుదల చేస్తారు. 22న ఉదయం సత్యసాయి సన్నిధిలో వేదంతో వేడుకలు ప్రారంభమవుతాయి. 8.30 గంటలకు పంచాంగ శ్రవణ కర్త గోలి వెంకట సుబ్రమణ్యం శర్మ పంచాంగ శ్రవణం, వక్తల ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయి. సాయంత్రం సినీ ప్లేబ్యాక్ సింగర్ రమ్యా బెహరా సంగీత విభావరి ఉంటుంది. 23న సత్యసాయి యూత్ స్టేట్ కోఆర్డినేటర్ స్నేహలత ప్రసంగించనున్నారు.

నలుగురు విద్యార్థుల డీబార్

అనంతపురం: ఎస్కేయూ పరిధిలో సోమవారం నిర్వహించిన డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. డీబార్ అయిన వారిలో అనంతపురంలో ఇద్దరు, గుత్తిలో ఒకరు, కదిరిలో ఓ విద్యార్థి ఉన్నారు.

గుర్తు తెలియని యువకుడి హత్య

శెట్టూరు: కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఓ గుర్తు తెలియని యువకుడు కర్ణాటకలోని వైఎన్‌హెచ్ కోట వద్ద హత్యకు గురయ్యాడు. ఎస్‌ఐ యువరాజ్ తెలిపిన మేరకు... పూర్తి వివరాలు తెలియని 30 నుంచి 35 సంవత్సరాల వయసున్న ఓ యువకుడు వైఎన్‌హెచ్ కోట వద్ద ఈ నెల 13న హత్యకు గురైనట్లు ఆ ప్రాంత పోలీసుల నుంచి సమాచారం అందింది. హతుడి చొక్కా కాలర్‌పై మెట్రో టైలర్, కళ్యాణదుర్గం అనే లేబుల్ ఉంది. చేతిమీద కావేరి, చిట్టి అనే పేర్లతో పచ్చబొట్టు ఉంది. ఈ ఆనవాళ్ల ఆధారంగా హతుడు ఎవరైంది గుర్తిస్తే 91647 07845, 94808 02979కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

వైద్యుల పాత్ర కీలకం

- ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి



ఫ్రెషర్స్‌డేని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి (చిత్రంలో) సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ తదితరులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆరోగ్యకరమైన సమాజాన్ని నెలకొల్పడంలో వైద్యుల పాత్ర కీలకమని అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి అన్నారు. మెడికల్ కళాశాల ఆడిటోరియంలో సోమవారం 2022 మెడికోల ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని 2020 బ్యాచ్‌కు చెందిన మెడికోల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రిన్సిపాల్‌తో పాటు సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన వైద్య సేవలను అందించడం ద్వారా ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందవచ్చన్నారు. ప్రాణాలు నిలిపే దేవుడుని దేవుడితో సమానంగా చూస్తారని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం వైద్యులందరిపైనా ఉందన్నారు. అనంతరం నూతనంగా చేరిన విద్యార్థులకు ఐడెంటిటీ కార్డులను, వివిధ పోటీల్లో ప్రతిభ చాటుకున్న వారికి మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం వైద్య విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ నవీద్ అహమ్మద్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శైలజ, డాక్టర్ నిహారిక, డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ అబ్దుల్ మజీద్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'వర్క్ టూ రూల్'

- జేఏసీ అమరావతి ఛైర్మన్ దివాకర్‌రావు వెల్లడి

అనంతపురం అర్బన్: ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్ల సాధనలో భాగంగా మంగళవారం నుంచి వర్క్ టూ రూల్ పాటించనున్నట్లు 'ఏపీ జేఏసీ అమరావతి' జిల్లా చైర్మన్ దివాకర్‌రావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉదయం పది నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ మాత్రమే విధుల్లో ఉద్యోగులు ఉంటారన్నారు. అనంతపురంలోని ఆ శాఖ కార్యాలయంలో సంఘం ప్రధాన కార్యదర్శి పీఎస్ ఖాన్‌తో కలసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వానికి తామెప్పుడూ వ్యతిరేకం కాదని, ఎన్నడూ బ్లాక్‌మెయిల్ చేయలేదని గుర్తు చేశారు. కేవలం పీఆర్సీ, జీపీఎఫ్ విషయంలో తప్ప మరే విషయంలోనూ ప్రభుత్వ విధానాలను తప్పుబట్టడం లేదన్నారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణపైనే మాట్లాడుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ఆందోళనలో భాగంగానే ఈ నెల 9వ తేదీ నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నామన్నారు. అదే క్రమంలో ఓట్ల లెక్కింపు రోజునా నల్ల బ్యాడ్జీలు ధరించామే తప్ప ఓటర్లను ప్రభావితం చేయడానికి కాదన్నారు. సమావేశంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, ఇతర నాయకులు పాల్గొన్నారు.

'పోలీస్ స్పందన'కు 36 వినతులు

కొత్తచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 36 వినతులు అందాయి. అర్జీదారులతో ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ముఖాముఖి వినతలు స్వీకరించి, సమస్య తీవ్రత అడిగి తెలుసుకున్నారు. భూ వివాదంలో తనకు పరిటాల శ్రీరామ్ నుంచి ప్రాణహానీ ఉందని, తనకు రక్షణ కల్పించాలంటూ ధర్మవరానికి చెందిన వెంకట్రాముడు ఫిర్యాదు చేశారు. అలాగే ఓ బంగారు వ్యాపారి రెండేళ్లుగా తనకు మూడు తులాల బంగారం ఇవ్వకుండా వేధిస్తున్నాడని పుట్టపర్తి మండలం కోవెలగుట్టపల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ, అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తున్నారని హిందూపురానికి చెందిన మాధురి ఫిర్యాదు చేశారు. చట్టపరిధిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఈ సందర్భంగా ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కేవీ రామకృష్ణ ప్రసాద్, డీసీఆర్బీ ఎస్‌ఐ హరూన్‌బాషా పాల్గొన్నారు.